


ఉదయం నుంచీ ఒకటే వాన. మొదట చిరుజల్లుగా మొదలైన వాన క్రమేపీ కుంభవృష్టిగా మారింది. వీథులన్నీ జలమయం అయ్యాయి.

వేణుగోపాలస్వామి గుడిలో ఉన్న మాధవాచారి మనసు దిగులుగా ఉంది. అతనా గుడి అర్చకుడు. వేణుగోపాలుని దర్శనానికి వచ్చిన భక్తులు వేసే దక్షిణలే అతని జీవనాధారం. ఆ రోజు వానమూలాన భక్తులెవరూ భగవంతుని దర్శనానికి రాలేదు.

మాధవాచారికి కడుపులో ఆకలి ఉప్పెనలా చుట్టేసింది. శరీరం నిస్సత్తువగా మారి నిస్ప్రాణగా అనిపించింది. స్వామి విగ్రహం వంక చూశాడు. వేణుగోపాలుడు ధైర్యం చెబుతున్నట్లు నవ్వుతూ కనిపించాడు.

మాధవాచారి గర్భగుడి నుంచి బయటకు వచ్చాడు. ధ్వజస్తంభం వరకు వెళ్లి చూశాడు. వీథంతా నిర్మానుష్యంగా ఉంది. కనుచూపు మేరలో ఎవరూ కనిపించలేదు. 'తన పిచ్చి గానీ ... ఈ జడివానలో స్వామిని దర్శించడానికి ఎవరొస్తారు?' అనుకున్నాడు. అయినా మనసులో ఏదో మూల చిన్న ఆశ లేకపోలేదు.

మరలా స్వామి సమీపానికి వెళ్లాడు. స్వామి దగ్గర దీపం కొడిగట్టకుండా నూనె పోశాడు. అతనికి తులసి జ్ఞాపకానికి వచ్చింది. అతని మనసు ఆర్ద్రమైంది. ఈ వానలో ఒక్కతే బిక్కుబిక్కుమంటూ తనకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. తను తెచ్చే బియ్యంకోసం ఆశగా ఎదురు చూస్తూంటుంది. తాము కడుపునిండా తిని ఎన్ని రోజులైందో! రెండు రోజులనుంచి అయితే ఆ కాసిన్ని నూకలు కూడా కరువయ్యాయి. మాధవాచారి నిట్టూర్చాడు.

వానకు గాలి తోడైంది. చలిగాలి విసురుగా వచ్చి అతని ఒంటిని తాకింది. మాధవాచారి భుజాలనిండుగా ఉత్తరీయం కప్పుకున్నాడు. దీపం ఆరకుండా కాస్తంత ఓరగా తలుపులేశాడు. దీపం వెలుగులో వేణుగోపాలుడు వెలిగిపోతున్నాడు. ఆ విగ్రహం చూస్తే చాలు మాధవాచారి మనసు పులకించిపోతుంది. కళ్లు మూతలు పడిపోతాయి. ఆకలి దప్పులు మరచిపోతాడు.

మాధవాచారి గుడిమెట్టుమీద కూర్చుని కురుస్తున్న వానవంక చూడసాగాడు. గుడి ప్రాంగణంలోని పారిజాతం చెట్టు వానకు తడుస్తూ, చలికి ఒణుకుతున్నట్లు ఊగుతున్నది. సాయంత్రం అయిదు గంటలకే చిరుచీకట్లు అలుముకున్నాయి.

అతనికి మరలా తులసి జ్ఞాపకానికి వచ్చింది. తమకు పెళ్లయి పదేళ్లయింది. ఇంకా పిల్లలు పుట్టలేదు. తులసికి పిల్లలంటే ప్రాణం. పెళ్లయిన తొలి రోజుల్లో తమ మధ్యకు బాలకృష్ణుడు రావాలని తెగ కలలు కనేది. కానీ ఆమె కల పండలేదు.

ఆ తరువాత తులసి బాలకృష్ణుడి గురించి మాట్లాడటం మానేసింది. ఆ మురిపెం భర్త గుండెలో ముల్లు కాగలదని ఆమె భయం.

తులసి కడుపు పండకపోవడానికి వేణుగోపాలుడి కృప లేకపోవడమేనని మాధవాచారి రాజీపడ్డాడు. కానీ భార్య కడుపునింపే విషయంలో మాత్రం అలా రాజీ పడలేకపోయాడు. అది తన అసమర్థతగా భావించాడు.

ఆకాశం మెరిసింది. దూరాన పిడుగు పడింది. ఆ భయంకర శబ్దానికి అతను మనసులో వేణుగోపాలుడిని స్మరించాడు.

వెళ్లేటప్పుడు వరహాలశెట్టిని కలిసి కాసిని బియ్యం అప్పు అడగాలనుకున్నాడు. కానీ అప్పటికే శెట్టికి చాలా సొమ్ము బాకీ ఉన్నాడు. వారం క్రితం మరి అప్పు ఇవ్వనని శెట్టి నిష్కర్షగా చెప్పేశాడు కూడా. ఇస్తాడన్న ఆశ లేకపోయినా, అడిగి చూడాలి అనుకున్నాడు మాధవాచారి.

ఇటువంటి వాన సమయాన వేడివేడి అన్నంలో పప్పు, ఆవకాయ కలుపుకుని, అందులో

అతను గుడిమెట్ల దగ్గరనుంచి స్వామి సన్నిధానానికి నడిచాడు. చలిగాలి స్వామిని తాకగలదన్న భావన అతన్ని ఒణికించింది. అంతవరకూ ఆ విషయం ఆలోచించనందుకు తనను తాను నిందించుకున్నాడు. స్వామివారి పట్టుబట్టలు సరిచేసి, మరో పట్టువస్త్రం విగ్రహం భుజాలచుట్టూ కప్పాడు. అతనికి తృప్తిగా అనిపించింది.

సమయం ఏడు దాటింది. ఎన్నడూ లేనిది ఈ రోజు మధ్యాహ్నం ఇంటికి పోలేదు. వట్టిచేతులతో ఇంటికి వెళ్లాలనిపించలేదు. తను రానందుకు తులసి కలతచెంది ఉంటుంది. కంట నీరు పెట్టుకుని ఉంటుంది. మాధవాచారి ఇంటికి బయలుదేరాలనుకున్నాడు. అంతలో అతని దృష్టి స్వామివారి హుండీమీద పడింది.

అందులో పది రూపాయలు తీస్తే ఈ రోజుకు తన సమస్య తీరిపోతుంది అనుకున్నాడు మాధవాచారి. కానీ అది దొంగతనం అవుతుంది. పాపం మూటకట్టుకోవాలి అని మనసులో

# మళ్లీ మ్రోగిన మురళి!

ఎస్. శివనాగేశ్వరరావు

నెయ్యి వేసుకుని తింటే, ఓహ్.... ఆ రుచి తలుచుకుంటే నోరూరింది.

మాధవాచారికి కడుపులో ఆకలి మరింత పెరిగింది. వాన తగ్గే సూచనలు కనిపించలేదు. భక్తులు గుడికి వస్తారన్న ఆశ కూడా అడుగంటింది.

మథనపడ్డాడు.

ఆ ఆలోచన వచ్చాక అతని మనసు సందిగ్ధంలో పడింది. తులసి ఆకలి జ్ఞాపకం వచ్చి హుండీలో డబ్బు తీయాలనిపించింది. వేణుగోపాలుడు తలపుకొచ్చి అది తప్పనిపించింది.

సాధారణంగా హుండీకి తాళం వేసి సీలు వేస్తారు. కానీ ఆ ఊరిపెద్ద రామచంద్రయ్యకు మాధవాచారి నిజాయితీ తెలుసు. అతని మంచితనంమీద నమ్మకం పుష్కలంగా ఉంది. అందుకే హుండీ తాళానికి సీలు వేయలేదు. తాళం చెవికూడా మాధవాచారి దగ్గరే ఉంది.

తను హుండీలోంచి డబ్బు తీసిన సంగతి మానవమాత్రుడెవరికీ తెలియదు. కానీ సర్వాంతర్యామి అయిన వేణుగోపాలుడి దృష్టి నుంచి తను తప్పుకోగలడా? స్వామి దృష్టిలో

'.... వట్టిచేతులతో ఇంటికి వెళ్లాలనిపించలేదు. తను రానందుకు తులసి కలతచెంది ఉంటుంది. కంట నీరు పెట్టుకుని ఉంటుంది. మాధవాచారి ఇంటికి బయలుదేరాలనుకున్నాడు. అంతలో అతని దృష్టి స్వామివారి హుండీమీద పడింది.... !'

'దొంగ' అన్న ముద్ర పడదా?

మాధవాచారి చాలాసేపు మథనపడ్డాడు. స్వామి గురించి తనెందుకు మథనపడాలి? అలా అనుకుంటే ఆయనమాత్రం దొంగ కాదా? బాల్యంలో అతనెన్ని వెన్నముద్దలు దొంగలించలేదు? ఎందరు గోపికల ఇళ్లల్లోని ఉట్టిలు కొట్టలేదు? యశోద తప్పని చెప్పినా విన్నాడా? అది పసితనమని ఎందుకు సరిపెట్టుకోవాలి? సర్వజ్ఞుడైన భగవానుని మనసుకు బాల్యమనేది ఉంటుందా?

చాలాసేపు అంతర్మథనం చెందిన తరువాత కూడా మాధవాచారి మనసు హుండీలోని డబ్బు తీయడంవైపే మొగ్గింది. అతను వేణుగోపాలస్వామి పాదాలముందున్న తాళంచెవి అందుకుని హుండీవద్దకు నడిచాడు. ఎవరైనా అటుగా వస్తున్నారేమో నని చూశాడు. ఎవరూ కానరాలేదు. వాన జోరుగా కురుస్తూనే ఉంది.

హుండీ తాళం తెరుస్తుంటే చేతులు వణికాయి. స్వామి పాదాలముందున్న దీపం సాక్షిగా హుండీలోంచి పది రూపాయల నోటు తీసి తాళం వేశాడు. తాళం చెవి యథాస్థానంలో ఉంచి గుడి తలుపులు మూశాడు.

గొడుగు వేసుకుని కాలు బయటపెట్టాడు. గొడుగున్నా, వానజల్లుకు శరీరం తడుస్తూనే ఉంది. రొంపిన దోపిన పది కాగితం భద్రంగా ఉందో, లేదోనని మధ్యమధ్యలో తడిమి చూసుకుంటూనే ఉన్నాడు.

అతను సరాసరి వరహాలశెట్టి దుకాణం వద్దకు వెళ్లాడు. అంత వానలో కూడా శెట్టి కొట్టు తీశాడు. మాధవాచారి పది నోటు ఇచ్చి బియ్యం, పప్పు, నూనె తీసుకున్నాడు. అవి తడవకుండా ప్లాస్టిక్ సంచీలో జాగ్రత్త చేసి ఇంటికి బయలుదేరాడు.

కడుపులో ఆకలి మరింత పెరిగింది. వేగంగా వంట చేయించి తులసి, తను తృప్తిగా భోజనం చేయాలనుకున్నాడు. క్రమేపీ అతని హృదయంనుంచి తప్పు చేశానన్న భావన మాయం కాసాగింది. మరునటి రోజునుంచి దక్షిణగా వచ్చిన డబ్బుల్లో రోజుకో రూపాయి హుండీలో వేసి పాపం కడిగేసుకోవాలనుకున్నాడు.

మాధవాచారిని చూడగానే తులసి ముఖం సంతోషంతో విప్పారింది. నవ్వుతూ ఎదురొచ్చి అతని చేతిలోని గొడుగు, సంచీ అందుకుంది. భార్యముఖంలోని సంతోష వీచికలు చూసి అతని మనసు మురిసింది.

హుండీలోంచి డబ్బు తీయడం దొంగతనమే అయినా ... ఆ పని తనకోసం చేయలేదు. తనను నమ్ముకున్న భార్యకోసం చేశాడు. భర్తగా, భార్య కడుపు నింపవలసిన బాధ్యత తనకుంది. ఆ బాధ్యతను నిర్వర్తించడానికి చేసిన చిన్న తప్పు దొంగతనం అనిపించుకోదు. వేణుగోపాలస్వామి దృష్టిలో తను దొంగ కాదు. స్వామి అర్థం చేసుకుంటాడు. అతను హృదయంలో సమాధానపడ్డాడు.

మాధవాచారి కాళ్లు కడుక్కుని ఇంట్లోకి నడిచాడు. తులసి పొయ్యి వెలిగించి, ఎసరుపెట్టి బియ్యం వేసింది. చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చి పొడిగుడ్డతో భర్త తల తుడిచింది. తరువాత తను కింద కూర్చుని అతని పాదాలు తుడుస్తూ "ఇంత వానలో గుడికి వచ్చి దక్షిణ వేసిన ఆ పుణ్యమూర్తులు ఎవరు?" అని అడిగింది.

హుండీలోంచి డబ్బు తీసిన సంగతి భార్యతో చెప్పదలుచుకోలేదు. 'అది తెలిస్తే ఆమె మనసులో బాధపడుతుంది. తిండి కూడా సరిగా తినదు. రెండు రోజుల ఆకలి అలాగే మిగిలిపోతుంది' అని ఆలోచించిన మాధవాచారి "పొరుగూరు వారనుకుంటాను. వానసైతం లెక్కచేయక వచ్చి అర్చన చేయించుకుని పది రూపాయలు ఇచ్చి వెళ్లారు!" అయిష్టంగానే అబద్ధం చెప్పాడు. "అంతా వేణుగోపాలుడి దయ!" తులసి పొయ్యి దగ్గరకు నడిచింది.


అరగంటలో సిద్ధమైంది వంట. వేడివేడి అన్నంలో ముద్దపప్పు వేసుకుని, అందులో ఆవకాయ కలిపి, నేతిగిన్నెలో అడుగంటిన నెయ్యి కాస్త వేసుకుని ముద్దచేసి ఆ ముద్ద తులసి నోటికి అందించాడు. ఆమె వేణుగోపాలుడ్ని తలచుకుని ఆ ముద్ద ఆరగించింది. ఆ రాత్రి భార్యా భర్తలిద్దరూ తృప్తిగా భోజనం చేశారు.

భోజనాలు అయ్యాక తులసి వంటపాత్రలు శుభ్రం చేసి వచ్చింది. చాప వేసి, దానిమీద బొంతపరచి, దిండు వేసింది. మాధవాచారి ఆ చాపమీద నడుం వాల్చాడు. తులసి భర్తపాదాలు ఒత్తసాగింది. అతను మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

భర్త నిద్రించడం గమనించిన తులసి అతనికి దుప్పటి కప్పి, తలుపులు గడియపెట్టి వచ్చి అతనికి కాస్తంత దూరాన నడుం వాల్చింది.

నిదురలోకి జారిన మాధవాచారికి స్వప్నంలో బాలకృష్ణుడు కనిపించాడు. అతను ఓ గోపిక ఇంట్లో దూరి ఎవరూ చూడకుండా వెన్నముద్దలు దొంగిలించాడు. ఎంతో ఇష్టంగా ఆరగించాడు. అంతలో తలుపు చప్పుడైంది. బాలకృష్ణుడు తలుపు చాటున నక్కాడు. తలుపు తీసుకొచ్చిన గోపిక వెన్నెముద్దలు మాయం కావడం గమనించింది. అంతలో చిన్నికృష్ణుడు బయటకు పరుగుతీశాడు. అది చూసి గోపిక .... దొంగ! దొంగ! అని కృష్ణుడి వెంటపడింది. ఆమె కేకలకు మరికొందరు గోపికలు ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చారు. వాళ్లకూ చిన్నికృష్ణుడి ఆగడాలు తెలుసు. వాళ్ల ఇళ్లల్లోని వెన్నముద్దలూ మాయమయ్యాయి. వాళ్లు కూడా కృష్ణుడివెంటపడ్డారు.

బాలకృష్ణుడు బుడిబుడి అడుగులతో పరుగు తీస్తున్నాడు. అంతలో వాన మొదలైంది. కృష్ణుడు తడిసిపోసాగాడు. అయినా గోపికలు వదల్లేదు. ఎలాగైనా ఈసారి అల్లరి కృష్ణుడ్ని పట్టుకుని యశోదకు అప్పగించి దండించాలని పట్టుదలగా ఉన్నారు. వాళ్లకు చిక్కకూడదని చిన్నికృష్ణుడు



కూడా వట్టుదలగానే ఉన్నాడు. వానకు కృష్ణుడి వట్టువస్త్రాలు తడిసిపోయాయి. నెమలిపింఛం ఎక్కడో జారిపోయింది.

'అయ్యో! బాలగోపాలా! తడిసిపోతున్నావు నాయనా! నీ కెన్ని కష్టాలొచ్చాయి? పాడు గోపికలు, పసిబాలుడన్న ఇంగితం లేకుండా నీ వెంటపడ్డారు. మనసు లేని మనుషుల్లా ఉన్నారు!' మాధవాచారి తల్లడిల్లిపోసాగాడు. అతని శరీరంలోని అణువణువూ చిన్నికృష్ణుడికొచ్చిన కష్టానికి పరితపించిపోతున్నది.

అంతలో చిన్నికృష్ణుడు మాధవాచారి ఇంటి తలుపు తోసుకుని లోవలకు వచ్చాడు. 'మాధవా! ఈ దొంగను నీవే కాపాడాలి. గోపికలు తరుముకొస్తున్నారు!' అని బతిమాలుకున్నాడు. మాధవాచారి వెళ్లి తలుపులు మూసేశాడు. 'కృష్ణా! మరి నీ కొచ్చిన భయమేం లేదు. ఆ గోపికలు వస్తే తిట్టి తరిమేస్తాను. వరుగెత్తి, వరుగెత్తి నీ పాదాలు ఎంత కందిపోయాయో చూడు! నీ పాదాలకంటిన బురద కడుగుతాను. కందిన నీ పాదాలు ఒత్తుతాను!" అంటూ మాధవాచారి చిన్నికృష్ణుడి పాదాలు కడిగాడు. ఆ జలం భక్తిప్రపత్తులతో తలమీద జల్లుకున్నాడు. కృష్ణుడ్ని చాపమీద పడుకోబెట్టాడు. చలికి చిన్నికృష్ణుడు వణకసాగాడు. మాధవాచారి, కృష్ణుడికి దుప్పటి కప్పి పాదాలు సుతిమెత్తగా వత్తసాగాడు.

అప్పుడు బాలకృష్ణుడు "మాధవా! భోజనమైందా?" అని అడిగాడు. ఆ ప్రశ్నకు మాధవాచారి ఉలిక్కిపడ్డాడు. "చేశాను, నాయనా!" అన్నాడు. "కడుపు నిండిందా?" కొంటెగా అడిగాడు చిన్నికృష్ణుడు. మాధవాచారి ఇబ్బందిగా కదిలి, "అంతా నీ దయ!" అన్నాడు. "అంత మాటెందుకులే, మాధవా! ఎంతయినా నేను దొంగను కదా!" అన్నాడు బాలగోపాలుడు.

ఆ మాటకు మాధవాచారి కలవరపడ్డాడు. సాయంత్రం హుండీలోంచి డబ్బు తీసేటప్పుడు 'స్వామి మాత్రం దొంగ కాదా?' అని తననుకున్న మాటే కృష్ణుడు గుర్తు చేస్తున్నాడని అర్థం చేసుకుని తప్పిదం చేసినట్లు తల దించుకున్నాడు.

అతని బాధ గమనించిన చిన్ని కృష్ణుడు. "మాధవా! మురళి ఊదనా? వేణుగానం వింటావా?" అని అడిగాడు. మాధవాచారి సంతోషానికి అవధుల్లేవు. ఆనందంగా తల వంకించాడు. చిన్ని కృష్ణుడు మురళి ఊదసాగాడు. అయితే మురళి మోగలేదు. వేణుగానం వినిపించలేదు.

మురళి ఎందుకు మోగలేదా? అని మాధవచారి అయోమయం చెందాడు. అప్పుడు చిన్నికృష్ణుడు "మాధవా! మురళి మోగలేదు. ఎందుకో తెలుసా, నీవు తప్పు చేశావు. దోషులకు నా వేణుగానం వినిపించదు!" అని బుడిబుడి అడుగులు వేసుకుంటూ బయటకు నడిచి క్షణంలో మాయమయ్యాడు.

మాధవాచారికి మెలకువ వచ్చింది. 'ఎంత తప్పు చేశానూ?!' అనుకున్నాడు. స్వప్నం మరోసారి మననం చేసుకుంటూండగా అతని దృష్టి తెరచి ఉన్న తలుపులమీద పడింది. ఇంటి గచ్చుమీద అక్కడక్కడా బురద అంటి ఉంది. లాంతరు తీసుకువెళ్లి ఆ బురదను పరీక్షగా చూసిన మాధవాచారి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. బురదంటినచోట బుల్లి బుల్లి పాదముద్రలున్నాయి. తనకు వచ్చింది స్వప్నం కాదు, నిజంగానే బాలగోపాలుడు తమ ఇంటికి వచ్చాడు!

అతను సంభ్రమంతో, గుండె అదురుతుండగా తులసిని తట్టి లేపాడు. "తులసీ! స్వామి వచ్చాడు. సాక్షాత్ ఆ బాలకృష్ణుడు మన ఇంటికి వచ్చాడు. నా తప్పు సరిదిద్దడానికి వచ్చాడు!" అని చెప్పాడు. నిద్రనుంచి మేల్కొన్న తులసి భర్తకు ఏదో కలవచ్చిందని సరిపెట్టుకుంది.

మాధవాచారి సర్వం మరిచాడు. ఆ వానలోనే తడుచుకుంటూ వేణుగోపాల స్వామి గుడివైపు వరుగు తీశాడు. గుడి తలుపులు తెరిచి దీపం వెలిగించాడు.

స్వామి పాదాలముందు మోకరిల్లి "వేణుగోపాలా! నేను తప్పు చేశాను. పాపిష్టివాణ్ణి. నిన్ను శ్రమపెట్టాను. గోకులం నుంచి నా కోసం ... నా తప్పు సరిదిద్దడంకోసం ... వానలో తడుస్తూ ... బురదలో నడుస్తూ ... నా ముంగిటికొచ్చావు. .నా తప్పు మన్నించు! మరెన్నడూ ఇటువంటి తప్పు చేయను!" అని ప్రార్థించాడు.

అంతలో మనసు 'తప్పుకు శిక్ష అనుభవించాలి, ప్రార్థన సరిపోదు!' అని తీర్పు చెప్పింది.

మాధవాచారి పైకి లేచాడు. హారతి కర్పూరం అరచేతిలో పెట్టుకున్నాడు. దాన్ని వెలిగించి దేవుడికి హారతి పట్టాడు. హారతి కర్పూరం హరించుకుపోతూ అతని అరచేతిని కాల్చింది. హుండీలోంచి డబ్బు దొంగిలించిన దక్షిణహస్తం భగ్గున మండింది. మాధవాచారి ఆ బాధను సంతోషంగా, తన తప్పుకు శిక్షగా భరించాడు.

అతను వేణుగోపాలుడి పాదాలముందు వాలిపోయి "స్వామీ! చేసిన తప్పుకు ఎంతటి కఠినమైన శిక్షనైనా భరిస్తాను. ఆఖరికి మరణదండనైనా సంతోషంగా స్వీకరిస్తాను. కానీ నన్ను క్షమించాననడానికి నిదర్శనంగా ఒక్కసారి నీ మురళి మోగించు. నీ వేణుగానం వినిపించు!" అని రోదించాడు. అతని కన్నులనుంచి అశ్రుధారలు కురిసి స్వామిపాదాలను అభిషేకించాయి.

మెలమెల్లగా అతని కళ్లు మూతలుపడ్డాయి. అంతలో ఎక్కడినుంచో లీలగా వేణుగానం వినిపించింది. ఆ వేణుగానం మెల్లమెల్లగా ... అలలు అలలుగా తేలి వచ్చి అతని హృదయమంతా నిండుకుని పరవశాన్ని కలిగించింది.

*(దైవ సన్నిధిలో తరిస్తున్న జగదీశ్వరి అక్కకు ప్రేమతో అంకితం)*

■

